

తిరుమలలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# అందరికీ ఒకేలా దర్శనం ఉండాలి

- ఏపీకి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి
- తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి

పాలమూరు, డిసెంబర్ 19: తెలంగాణ, ఏపీ ప్రజలు, నాయకులు, వ్యాపారవేత్తలు అందరికీ ఒకే మాదిరిగా తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనం కల్పించాలని.. అందుకు అనుభవజ్ఞులైన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం తెల్లవారుజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ఏపీలో ఉన్న ఏకైక సం బంధం తిరుపతి, తెలంగాణలో పుట్టిన ప్రతిబిడ్డ తిరుపతి లో తలనీలాలు సమర్పించుకుంటారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండేవని, రెండు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వంతోపాటు టీటీడీ పాలకమండలి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగింపుగా దర్శనాలు జరిగేవని, గతం లో ఏపీ సీఎంలు చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు కొనసాగింపు దర్శనాలు జరిగాయన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తెలంగాణ సామాన్య ప్రజలకు, రాజకీయ నాయకులు, వ్యాపాయవేత్తలు డిఫరెన్స్ కనిపిస్తున్నదని.. ఇది మంచి పరిణామం కాదన్నారు. టీటీడీ పాలక మండలి అంటే మాకు చాలా గౌరవం ఉందని.. తిరుమల దేవుడు ప్రపంచానికే దేవుడన్నారు. ఈ ప్రాంతంలో ఉన్నంత మాత్రాన.. మాది అని దేవుని విషయంలో అనుకోవద్దని.. అలా అనుకుంటే ఆ దేవుడికే కోపం వస్తుందన్నారు. పదేండ్లలో హైదరాబాద్, తెలంగాణలో ఆంధ్రప్రజలను, వ్యాపారవేత్తలను భేదాభిప్రాయాలు లేకుండా చూశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీ వ్యాపారులే లాభపడ్డారన్నారు. తెలంగాణలో టీటీడీ కల్యాణ మండపాలకు స్థలాలు ఇవ్వడం గొప్ప సంకల్పంగా, అదృష్టంగా భావిస్తామన్నారు. అదే విధంగా భక్తులకు రూమ్స్, దర్శనంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఇచ్చిన మాదిరిగానే తిరుమల కొండపై కాటేజ్ నిర్మాణానికి తెలంగాణకు ఒక ఎకరం స్థలం ఇవ్వాలని గతంలో కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో టీటీడీపై అపారమైన గౌరవంతో తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, రైతుబంధు జిల్లా మాజీ డైరెక్టర్ మల్లు నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్ తదితరులు ఉన్నారు.

# రాత పరీక్ష రద్దు చేయాలి



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

- కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల ధర్నా

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు రాత పరీక్షను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించేందుకు రెగ్యులర్ చేయాలని గురువారం ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియొద్దీన్ మాట్లాడుతూ.. ఇంతకాలం కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేసిన ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయకుండా రాత పరీక్ష పేరుతో కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తూ దాదాపుగా 20ఏండ్లుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నా పనికి తగ్గ పారితోషికం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం ఏకపక్షంగా పరీక్ష పద్ధతి నిర్వహించి ఎంపిక చేయాలని దుర్మార్గపు ఆలోచన చేస్తున్నదని.. దీనిమూలంగా 20 ఏండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంల సీనియారిటీ పోతుందన్నారు. పర్మినెంట్ చేయకుండా పరీక్ష పద్ధతి ద్వారా ఎంపిక చేస్తాననడం దుర్మార్గమైన చర్య అన్నారు. పాతవారిని పర్మినెంట్ చేసి కొత్తగా వచ్చిన వారిని రాత పరీక్ష ద్వారా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనివాసులు, బాలస్వామి, శివరాములు, సుగుణ, అరుణ, శివానీ, మంజుల, కృష్ణవేణి, హైమావతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల పరిజ్ఞానం అత్యవసరం




జాతీయ సదస్సు బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వీసీ, ప్రిన్సిపల్, కన్వీనర్, అధ్యాపకులు

- జాతీయ సదస్సులో పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 19 : ప్రతి ఒక్కరికీ ఆంగ్ల పరిజ్ఞానం అత్యవసరమని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ భాషల్లో ఆంగ్ల భాషకే అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. 'హైబ్రిడింగ్ అండ్ బిలాంగింగ్– ఇంగ్లీష్ ఇన్ ఏ ట్రాన్సిషనల్ వరల్డ్' అనే అంశంపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన రీసెర్చ్ స్కారల్స్, యూనివర్సిటీ ప్రొఫెసర్స్ తమ పరిశోధన పత్రాల్ని ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. జమ్ముకాశ్మీర్, మహారాష్ట్ర, కేరళ, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రా నుంచి హాజరయ్యారు. జాతీయ సదస్సుకు ప్రధాన వక్తగా తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవీ.రఘుపతి, ఆంధ్రప్రదేశ్ పులివెందుల జేఎన్‌టీయూ అసోసియేట్ ప్రొఫెసర్ సాంబయ్య ప్లీనరీ స్పీకర్లుగా వ్యవహరించారు. ఈ సదస్సు కన్వీనర్, హెచ్‌వోడీ జి.రంగ సూర్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 132 పరిశోధనా పత్రాల్ని సమర్పించారని తెలిపారు. హాంకాంగ్ దేశం నుంచి హాంకాంగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి. జాసన్ తన పరిశోధన పత్రాల్ని సమర్పించారు. సదస్సు లో కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి, అధ్యాపకులు ఖాదర్‌వలీ, వి.రామన్‌గౌడ్, ఉమారాపాక, జాస్పర్ సుకీర్తి, శారద, కిరణ్, బాలకృష్ణ, నిహారిక, కృష్ణమూర్తి, రవీందర్, మల్లికార్జున, పీయూ ఇంగ్లీశ్ విభాగాధిపతి జే.మాలవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి వరకు కేఎల్‌ఐ నీళ్లు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19: మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వచ్చే ఏడాది మార్చినెల చివరి వరకు సాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలో సాగుకు అనుకూలంగా ఉన్న 2.8 లక్షల ఎకరాకు సాగునీటిని అందించనున్నట్లు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కేఎల్‌ఐ ద్వారా సాగునీటిని అందించే విషయమై నిర్ణయించినట్లు రాష్ట్ర నీటి పారుదలశాఖ ఎస్‌ఈ సత్యానారాయణరెడ్డి వెల్లడించారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని అందుకు లోబడి సాగునీరు అందించనున్నారు.

- తెలంగాణ ధాన్యం కర్ణాటకకు రావొద్దంటూ అడ్డగింత
- వాసునగర్ చెక్‌పోస్ట్ వద్ద రైతులు, రైతు సంఘాల నాయకుల నిరసన
- రెండు రాష్ట్రాల్లో విక్రయించేలా అనుమతించాలని రైతుల నినాదాలు
- పట్టించుకోని అధికారులు, స్థానిక నాయకులు
- చేసేదేమీ లేక వెనుదిరిగిన మన కర్షకులు
- ధ్రువపత్రాలు చూపించినా కర్ణాటక ధాన్యం సైతం నిలిపివేత



దేవసూగురు చెక్‌పోస్టు వద్ద తెలంగాణ వాహనాలను తిప్పి పంపుతున్న వైనం

# కొనుగోళ్ల పంచాయితీ

మాగనూరు/కృష్ణ, డిసెంబర్ 19 : తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం కారణంగా రైతుల మధ్య ధాన్యం కొనుగోళ్ల పంచాయితీ నడుస్తున్నది. కొద్దిరోజులుగా కర్ణాటక రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలో అమ్మకానికి తీసుకురాగా.. అధికారులు, పోలీసులు బార్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనాలను అడ్డుకొని వెనక్కి పంపిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు గురువారం కర్ణాటకలోని రాయిచూరుకు ధాన్యం లోడుతో వెళ్తున్న వాహనాలను నారాయణపేట జిల్లా కృష్ణ బార్డర్ చెక్‌పోస్ట్ వద్ద కర్ణాటక రైతులు అడ్డుకున్నారు. తమ ధాన్యాన్ని తెలంగాణలోకి అనుమతిస్తేనే.. వారి ధాన్యాన్ని తమ రాష్ట్రంలోకి పంపించాలంటూ నిరసన తెలిపారు. తెలంగాణలో క్వింటాకు రూ.2,320తోపాటు రూ.500 బోనస్ కలిపి రూ.2,820 మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆచరణలో అమలు కాకపోవడంతో రైతులు ధాన్యాన్ని నెలల తరబడి కల్లాల్లోనే ఆరబెడుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో బోనస్ ఇవ్వకపోవడంతోపాటు డబ్బులు నెలలుగా పెండింగ్‌లో ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు. కర్ణాటక వ్యాపారులతో ఇక్కడి రైతులు పెట్టుబడి కోసం డబ్బులు తీసుకొని సాగు చేశారు. దీంతో వ్యాపారులకు ధాన్యాన్ని అమ్మిన వెంటనే డబ్బులిస్తుండడంతో తెలంగాణ రైతులు కర్ణాటకలోని రాయిచూరు మార్కెట్లో ధాన్యాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ధాన్యాన్ని కర్ణాటకలో అమ్ముకునేందుకు వీలులేదంటూ గురువారం ఉదయం ఏడు గంటలకు 60 నుంచి 70 ట్రాక్టర్లు, బొలెరో వాహనాలను కృష్ణ మండలం వాసునగర్ చెక్‌పోస్ట్ వద్ద రైతు సంఘం కర్ణాటక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్యామరస మాలిక్ పటేల్, ఎన్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది రైతులు అడ్డుకున్నారు. కర్ణాటకలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలోకి రాకుండా అధికారులు అడ్డుపడుతుండడంతో వారికి ఆగ్రహం తెప్పించడంతో ఆందోళనకు దిగారు. దీంతో నారాయణపేట జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి వచ్చిన ధాన్యం వాహనాలు ఎక్కడికక్కడ బారులుదీరాయి. తమ రాష్ట్రంలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలో అనుమతిస్తే.. కర్ణాటకలోకి తెలంగాణ వాహనాలను పంపిస్తామని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. మధ్యాహ్నం 12:30 వరకు ఇటు కర్ణాటక, అటు తెలంగాణ అధికారులు, రాజకీయ నాయకులు రైతుల మధ్య నెలకొన్న పంచాయితీని పరిష్కరించేందుకు చొరవ చూపకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. రైతుల పక్షాన ఎవరూ నిలవడంలేదని, తమను పట్టించుకునే నాథుడే లేడంటూ నిట్టూర్చారు. ఇప్పటి నుంచి కర్ణాటకలోకి తెలంగాణ ధాన్యం రావాల్సిన అవసరమే లేదని, ఒకవేళ వస్తే ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపేస్తామని కర్ణాటక రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

**బార్డర్ల వద్ద రైతుల పడిగాపులు..**

వాసునగర్ చెక్‌పోస్ట్ వద్ద కర్ణాటక రైతుల ధాన్యాన్ని సైతం అడ్డుకున్నారు. తెలంగాణ బార్డర్ సమీపంలో ఉన్న దుప్పలి, బద్దిపల్లి, కడెచూడు, సైదాపూర్ గ్రామాల నుంచి వచ్చిన కర్ణాటక రైతులను తెలంగాణ రైతులతో పాటు నిలిపివేశారు. కర్ణాటక రైతులను కూడా వెనుదిరిగి పంపించడంతో కృష్ణ చెక్‌పోస్ట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆధార్ కార్డు, ఇతర త్రా పత్రాలను చూపించినా అనుమతించకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు.



కృష్ణ మండలం వాసునగర్ జాతీయ రహదారిపై నిలిచిన ధాన్యం వాహనాలు

### తెలంగాణలో వడ్ల డబ్బులు తొందరగా రావు..



తెలంగాణలో వడ్లు అమ్ముకోవడానికి బాధలేదు. కానీ అమ్మిన డబ్బులు త్వరగా రావడం లేదు. అప్పు చేసి వరి పంట సాగు చేశా. కూలీలకు మాట ఇచ్చా. పంట అమ్మిన తర్వాత డబ్బులు ఇస్తానని. మాట ఇచ్చాను. తెలంగాణలో రైతుబంధు రాలేక.. రుణమాఫీ కాలేక అప్పుల బాధ తట్టుకోలేకపోతున్నా. అందుకే కర్ణాటకకు తీసుకెళ్లి అమ్ముకొని డబ్బులు ముట్టిస్తా. **– తిమ్మప్ప, రైతు, మక్తల్ మండలం**

### పంట కోసం అప్పు తెచ్చుకున్నా..



వరి పంట వేసుకోడానికి రూ.1.50లక్షలు రాయిచూర్‌లోని శావుకారితో అప్పు తెచ్చుకున్నా. వడ్లు అమ్మి అప్పు తీరుద్దామని రాయిచూరుకు వడ్లు తీసుకెళ్తుంటే కర్ణాటక రైతులు, పోలీసులు అడ్డుకుంటుండ్రు. తెలంగాణ వడ్లు కర్ణాటక రావొద్దని.. ఇలా అడ్డుకుంటే వడ్లు అమ్మేది ఎప్పుడు.. అప్పు తీర్చేది ఎప్పుడు. రైతులకు రైతుబంధు కూడా రాలేదు అప్పు తీరుద్దామంటే.. **– నర్సింహ, రైతు, నర్వ మండలం**

### అమ్మి నెలైనా డబ్బులు రాలేదు..



మాది మక్తల్ మండలం పంచదేవ్ పాడు. మేము 5ఎకరాల్లో వరి పంట సాగు చేశాం. తెలంగాణ ప్రభుత్వానికి 250 వరి బస్తాలు అమ్మి నెలరోజులైనా డబ్బులు రాలేదు. ఓ పక్క కూలీలు డబ్బులు చెల్లించాలి. పంటల కోసం అప్పు చేసుకున్నాం. గత ప్రభుత్వమైతే పంటలు వేసుకోక ముందే రైతుబంధు వేసింది. ఇప్పుడైతే మాకు రుణమాఫీ కాలేదు. రైతుబంధు రాలేదు. **– వెంకటేశ్, రైతు, పంచదేవ్‌పాడు**



తిమ్మాజిపేటలో మర్రి నిర్మించిన ఉన్నత పాఠశాల భవనం

## తిమ్మాజిపేట పాఠశాలకు అవార్డు

తిమ్మాజిపేట, డిసెంబర్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. హైదరాబాద్‌కు చెందిన బిజ్.టీవీ అనే సంస్థ జిల్లాలోని 130 ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై అధ్యయనం చేసింది. మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, గతేడాది సంవత్సరం ఫలితాలు, ఉపాధ్యాయులు, భవనం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని స్కూల్‌ను అవార్డుకు ఎంపిక చేశారు. సుమారు రూ.3 కోట్లతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎంజేఆర్ ట్రస్టు నిధులతో అన్ని రకాల సదుపాయాలతో ఈ పాఠశాల భవనాన్ని పునర్నిర్మించారు. సోమవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో అందుకోనున్నట్లు జీహెచ్‌ఎం సత్యనారాయణశెట్టి తెలిపారు.

## కట్టెల వంతెన అదుర్స్



కేఎల్‌ఐ కాల్వపై నిర్మించిన కట్టెల వంతెన

వెల్దండ, డిసెంబర్ 19 : రైతు తన మెదడుకు మేత పెట్టి ఇంజినీర్‌గా మారాడు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గుండాల సమీపంలో అల్లంతోట బావితండాకు చెందిన రైతు ఇస్లావత్ శ్రీనుకు ఐదెకరాల పొలం ఉన్నది. అయితే అతడి పొలం మధ్యలో నుంచి కేఎల్‌ఐ కాల్వ తవ్వడంతో కాల్వకు పడమర వైపు రెండెకరాలు.. తూర్పు వైపు మూడెకరాలుగా చీలిపోయింది. దీంతో పంటల సాగుకు రైతు ఇబ్బందులు పడుతున్నాడు. ఇవతలి నుంచి అవతలి వైపు వెళ్లాలంటే దాదాపు మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఇబ్బందులు పడలేకపోతుండడంతో రైతుకు ఓ ఐడియా వచ్చింది. ఇంజినీర్‌లా మారి కాల్వపై కట్టెలు పాతి తడకలు వేసి వంతెన తయారుచేశాడు. ఇప్పుడు క్షణాల్లో అవతలి.. ఇవతలికి దాటుతున్నాడు. కట్టెల వంతనను చూసిన వారు అదుర్స్ అంటూ రైతును మెచ్చుకోక ఉండలేకపోతున్నారు.

# సరిహద్దులో ఇసుక వివాదం

- రీచ్‌లకు తరలింపును అడ్డుకున్న ఏపీ పోలీసులు

రాజోళి, డిసెంబర్ 19 : తెలంగాణ–ఏపీ సరిహద్దులో ఇసుక పంచాయితీ కొనసాగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం తూర్పు గార్లపాడు గ్రామ శివారులో పారుతున్న తుంగభద్ర నది నుంచి మన ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చింది. ఆన్‌లైన్‌లో అనుమతులు పొందిన వ్యాపారులు ఇసుక ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. అయితే గురువారం ఏపీ పోలీసులు అక్కడకు చేరుకొని ఏపీ సరిహద్దు నుంచి ఇసుక తరలిస్తున్నారని అక్కడి పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. స్థానికులు రాజోళి తాసీల్దార్, ఎస్సై జగదీశ్‌కు సమాచా రం అందించడంతో వారు అక్కడకు చేరుకొని ఏపీ పోలీసులతో మాట్లాడారు. సరిహద్దు విషయంపై పూర్తి వివరాలు తెలుసుకొని నదిలో తెలంగాణ సరిహద్దు ఏర్పాటుతో ఇసుకను తరలిస్తామని ఇరువురు చర్చించినట్లు సమాచారం. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో నదిలోకి వెళ్లి పరిశీలించారు. వారంలోగా రెండు రాష్ట్రాల అధికారులు పరిశీలించి సరిహద్దులను ఏర్పాటు చేస్తామని ఎస్సై జగదీశ్ తెలిపారు. ఈ సమస్యపై జిల్లా అధికారులకు సమాచారమిచ్చినట్లు తెలిపారు.



హద్దులు గుర్తించేందుకు నదిలో ట్రాక్టర్‌పై వెళ్తున్న పోలీసులు

## పునరావాసానికి రంగం సిద్ధం

- ఎఫ్‌ఆర్వో గురుప్రసాద్



లబ్ధిదారుల జాబితా విడుదలలో అధికారులు

దోమలపెంట, డిసెంబర్19: అభయారణ్య అటవీ ప్రాంతం నుంచి స్వచ్ఛంద పునరావాసం కోరుకుంటూ మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు గతంలో దరఖాస్తు చేసుకున్న అమ్రాబాద్ మండలంలోని వటవర్లపల్లి గ్రామస్తులను తరలించేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఎఫ్ఆర్వో గురుప్రసాద్ తెలిపారు. గురువారం వటవర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్‌బోర్డుపై పునరావాస లబ్ధిదారుల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో 773 మంది దరఖాస్తు చేసుకోగా.. గ్రామసభ తీర్మానంలో 663మందిని అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మరో 110మందిలో కొందరికి స్థానిక ఆధారం లేకపోవడం, మరికొంతమందికి 18ఏండ్లు నిండకపోవడం, పెండ్లి అయిన మహిళలు, మరికొంతమంది ఎస్‌డీఎల్‌సీ గ్రామ సభలో సంతకాల సేకరణకు రాకపోవడంతో వారి పేర్లను తొలగించినట్లు తెలిపారు. పునరావాస లబ్ధిదారుల ఎంపిక కోరుకున్న ప్యాకేజీ వర్తించనివారు రెండు వారాల్లోగా నేరుగా.. అచ్చంపేట డీఎఫ్‌వో, అమ్రాబాద్ ఎఫ్‌డీవోకు ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛంద పునరావాసం కోరుకునే వారు కొత్తవారెవరైనా, జాబితాలో రిజెక్టు అయినవారు, నూతనంగా దరఖాస్తు చేసుకునే చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ధర్మనాయక్, పం చాయతీ కార్యదర్శి రాంబాబు, అటవీశాఖ అధికారి శిల్ప, బాలయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

## 108 ఉద్యోగికి జాతీయ స్థాయి అవార్డు

నారాయణపేట రూరల్, డిసెంబర్ 19 : నారాయణపేట మండలం పేరపళ్ల కి చెందిన రాజ్‌కుమార్ 108 అంబులెన్స్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. పదేండ్లుగా ఆయన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలతోపాటు రాష్ట్రం నుంచి నియోనేటల్ అంబులెన్స్‌లో నవజాత శిశువును రక్షించినందుకుగానూ జాతీయ స్థాయిలో అవార్డు వరించింది. జీవీకే ఈఎంఆర్ఐ ఫౌండర్, చైర్మన్ జీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర 108 స్టేట్ హెడ్ ఖలీద్ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో అవార్డును రాజ్ అందుకున్నారు. దీంతో పలువురు ఆయ న్ను అభినందించారు.

### రోడ్డుపైనే ఉద్యోగుల భోజనాలు



సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నారాయణపేటలో వంటావార్పు నిర్వహించి రోడ్డుపైనే కూర్చొని భోజనం చేశారు. మహబూబ్‌నగర్‌లో కండ్లకు గంతలు కట్టుకోగా.. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో.. వనపర్తిలో మూతికి నల్లగుడ్డలు ధరించి.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బోనాలతో ర్యాలీ నిర్వహించారు. తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 19

### అమిత్‌షా వ్యాఖ్యలపై భగ్గు



రాజ్యసభలో అంబేద్కర్‌ను హేళన చేసి.. అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆగ్రహ జ్వాలలు కొనసాగాయి. గురువారం బీఆర్‌ఎస్, స్వేరోస్, బీఎస్పీ ఆధ్వర్యంలో రోడ్లపై బైఠాయించి నిరసనలు చేపట్టారు. పలు చోట్ల ఆయన దిష్టిబొమ్మలను ఊరేగింపుగా తీసుకొచ్చి దహనం చేశారు. మంత్రి పదవికి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని, లేదంటే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 19